పొడవని పొద్దు

దేవరాజు మహారాజు

"ఓరి పోరడా ఇంక లేవవేందిరా" - తల్లి గొంతు కఠినంగా వినిపించేసరికి కళ్ళు తెరిచాడు పోశిగాడు. లెమ్మని అంతకు ముందునుంచీ తల్లి చెబుతూనే వుంది. తల్లి గొంతూ, ఆమె నీళ్ళగోళెం నింపుతున్న చప్పుడూ, గుడిసెముందునుండి గొర్రెజీవాలు అరుచుకుంటూ పోయిన చప్పుడూ, గుడిసె వెనుక 'జాలాటిబండ' దగ్గర కాకుల చప్పుడూ అన్నీ వినిపిస్తూనే వున్నాయి. కాని మగతగా బద్ధకంగా వుండడంవల్ల లేవాలనిపించడంలేదు. లేవడం, పశువుల్ని కొట్టుకుని పోవడం, దినమంతా ఎండలో తిరగడం........అదే పని. పనిలో కొత్తదనం లేదు. పనిలో ఉత్సాహం లేదు. అందుకే లేవాలనిపించడంలేదు. విసిగిపోయి తల్లి కఠినంగా కేకేసేసరికి లేవక తప్పింది కాదు. చిరుగులు పట్టిన పాత చాప, సరిగా చుట్టొచ్చి చుట్టరాక చుట్టి గుడిసె వెనుక పెంటవైపు పరిగెత్తాడు. మూత్రం పోస్తూ నిలబడితే చెరువుకట్టమీద బెస్త ఎంకులు గాలాలు పట్టుకుని తండ్రితో పోతున్నాడు. ఎంకుల్ని పిలుద్దామనుకున్నాడు. కాని అల్లంత దూరంలో పోతున్న దొరోళ్ళ పశువులు కనిపించాయి. గుండెలో ఢక్ మంది. గుండెలో దప్పు చప్పుడు మొదలయ్యింది. గిరుక్కున వెనక్కి తిరిగి నీళ్ళ గోళెంలోని నీళ్ళు దోసిలితో తీసుకుని నోరు, కళ్ళు కడుక్కున్నట్టు చేసి గుడిసెల్లో కొచ్చాడు. తన 'గుతుపకట్టె' వెతికి తీసుకుని, ఒట్టి లాగు ఎగేసుకుంటూ గుడిసెలోంచి గులేరురాయిలాగా బయటపడ్డాడు.

"ఇగో పోశిగా!" తల్లి పిలుపు వినిపించి ఆగి వెనక్కి తిరిగాడు. పాతగుడ్డలో కట్టిన రాతివెండి గిన్నె తల్లి ఎదురుగా తెచ్చింది. "మాపటిది బువ్వుంది కొంటవోరాదు"- అంది. తల్లివైపు సరిగా చూడకుండానే గిన్నె అందుకుని మళ్ళీ అంత వేగంగా పరుగందుకున్నాడు. గుండెలో యింకా దప్పు మోగుతున్నట్టుగానే వుంది. తాత ఎంత కొడతాడోనని-

'పోశిగా'-అని అందరూ పిలిచే పోశయ్యకు ఎనిమిదేళ్ళు నిండినయి. నల్లగా పీలగా వుంటాడు. వాడికి ఊరు, ఊర్లోని మనుషుల కన్నా, అడివి, అడివిలోని పశువులు, చేన్లు బాగా పరిచయం. కొద్ది సంవత్సరాల క్రితందాకా "మీ అయ్యేడిరా"- అని ఎవరైనా అడిగితే కళ్ళు చిత్రంగా తిప్పి 'దేవున్తానికి పొయ్యిండు'-అని చెప్పేవాడు. ఎదుటివాళ్ళ కళ్ళు చెమ్మగిల్లేవి. రాను రాను వాడికేదో అర్థమైపోయింది. అయ్యపేరెత్తగానే ముఖం మాడ్చుకుంటున్నాడు. అయ్యను తల్చుకుని అవ్వ ఏడుస్తున్నప్పుడు వాడి మనసునంతా ఎవరో తోడేస్తున్నట్లయ్యేది. అవ్వ ఏడుస్తూ ఏడుస్తూ వూళ్ళోని దొరల్ని, పటేళ్ళను తిడుతూ వుండేది. శపిస్తూ వుండేది. వాడికవేమీ అర్థం కాకుండేవి. తన తండ్రిని వాళ్ళేం చేసారో తెలిసేదికాదు. ఒకసారి తల్లి నడిగితే ఒళ్ళోకి లాక్కుని తల నిమురుతూ బిగ్గరగా ఏడ్చింది. పోశయ్యకు భయమేసింది.

వాడి గుండెలో దప్పు మోత యింకా

ఎక్కువైంది. 'తాతతోని గుద్దులు తప్పవ్' అనుకుని మొస దీసుకుంటూ వాగుదాకా పరిగెత్తాడు. అక్కడే తాత ఎవరితోనో మాట్లాడుతూ వున్నాడు. వంగి దండాలు పెడుతూ వున్నాడు. ఆ మాట్లాగే అతన్ని తనెప్పుడూ చూళ్ళేదు. ఎర్రగా బొద్దుగా బావున్నాడు. తాతకన్నా చాలా చిన్నవాడు. అంత చిన్నోనికి తాత దండాలెందుకు పెడుతున్నాడో అర్థం కాలేదు తాత తనను చూసాడు. తన గుండె వూగులాడినట్లయ్యింది. ఆలస్యంగా వచ్చినందుకు తిట్లు తప్పవ్ అని లోలోన వణికిపోతున్నాడు. తాత ఏ ఆలోచనల్లో ఉన్నాడో-తిట్టలేదు. "గింత పొద్దెక్కేదాక పంటావుర పోరడ"—అని "ఇగ జూడు పట్నం లుండేటి శిన్న దొర కూడ ఎంత పొద్గాల లేసిండో" అని అతన్ని చూపించాడు. "ఆ- సర్ సర్ర బోయి పచ్చ బంగ్లోల్లయి బర్లు గొట్కరా

నో"–అని పురమాయించాడు. పోశయ్య అరవైపు పరిగెత్తాడు. కొద్దిసేపటి తర్వాత "అమ్మా! బల్ద్రు గొట్కపోనొచ్చిన"-అని పసుపురంగు బంగళాముందు నిలబడ్డాడు. ఇంటివాళ్ళబ్బాయి వచ్చాడు. స్కూలు యూనిఫాంలో చక్కగా తయారయి వున్నాడు. వెంట్రుకలు నున్నగా దువ్వుకుని వున్నాడు. కాళ్ళకు తెల్ల మేజోళ్ళు, నల్ల జోళ్ళు....అందంగా వున్నాడు. పోశయ్య అలా చూస్తూ నిలబడ్డాడు. తనకు కూడా అలా తయారవ్వాలని కోరిక. బడికి పోయి చదువుకోవాలని కోరిక...తనకంటే చిన్నవాడే యింటివాళ్ళబ్బాయి. అయినా సరే పేరుపెట్టి పిలవొద్దట. 'శిన్నయ్యగారో'—అని పిలవాలట.

యింటి వాళ్ళబ్బాయి చిలిపిగా నవ్వి-"ఇదిగో నాకు రానోక్కవడానికేమో మా

డాడీ యిచ్చారు"-అని పొడుగాటి వస్తువు చూపించాడు. పోశిగాడికి అర్థంకాలేదు. "ఏందది? సూపెట్టవా"-అని ప్రాధేయ పూర్వకంగా అడిగాడు.

"ఊ, నీకివ్వను—ఎవరికీ యివ్వొద్దంది

మా మమ్మి"

"ఇదీ బాల్ పెన్. ఇలా ప్రెస్ చేసి రాస్కోవాలి"-అని యింటివాళ్ళబ్బాయి గోడమీద రాసాడు. నిజంగానే గోడమీద నీలి నీలి గీతలు కనిపించాయి. పోశయ్య కళ్ళు మెరిసాయి.

"ఏం రాశినవ్ ఆడ"

"ఫోర్ ట్వన్టీ" అని రాసా. నువ్వే 420" బొలబొలా నవ్వాడు యింటివాళ్ళబ్బాయి. పోశయ్యకు ఏమంటున్నాడో అర్థం కాలేదు. తను చదువుకుంటే తనకూ అర్థం అయ్యేది. ఒక్కసారి ఆ పెన్ను చూద్దామనిపించింది. తను అరుగు కింద నిలబడ్డాడు. యింటివాళ్ళబ్బాయి అరుగుమీద నిలబడ్డాడు.

"ఒక్కసారి ఉట్టిగనే సూసిస్త"....

అన్నాడు పోశయ్య.యింటివాళ్ళబ్బాయి "నో"— అని పెదాలు బిగించి, చేతుల్లో పెన్ను దాచుకుని తల అడ్డంగా తిప్పాడు. పోశయ్య — దగ్గరకెళ్ళి చూద్దామనుకుని కట్టె ఆసరాతో అరుగెక్కాడు. అది ఊహించని యింటివాళ్ళబ్బాయి "మమ్మీ" ....అని యింట్లోకి పరిగెత్తాడు.

"ఏమిట్రా సీను ఏమైంది?"— యింటావిడ పరిగెత్తుకొచ్చింది. సీను పోశయ్యని చూపించాడు. "పోశిగాడు బాబును బయపెడుతున్నావ్ .. తప్పుగాదూ. అట్ల దిరిగి దొడ్లెకు రాపో. బర్లకు కుడితి తాపించి కొట్కపోదువు గని. ."

"బయపెళ్లేదమ్మా - గది పెన్నంట! సూశిస్తనన్న గుతె"

"చదువు రావోనివి నీక వెందుకూ-పోపో దొడ్లోకి పో" అమ్మగారు తనను తిట్టకుం డానే తిడుతున్నట్లని పించింది. సదువు రావోన్ని-సదువుకుంటే మంచి బట్టలు, పెన్నులు వస్తాయా? ఆలోచనలతో పోశి గాడు దొడ్లోకి వెళ్ళాడు. దొడ్లో బర్రెలను విడుస్తూండగా అమ్మగారొచ్చి "సాయంత్రం వొచ్చినప్పుడు పైసలిస్తగాని, బర్రెలను బాగా కడుక్కనిరా-ఏమంటున్న?"-అంది పోశిగాడు "ఆ" అన్నాడు, వెనకనే శ్రీని వాసొచ్చాడు. "మమ్మీ నేను స్కూలు కెళ్ళనుపో"- అన్నాడు బుంగ మూతితో. "ఏం ఏమైయ్యింది?"

"బాలల సంవత్సరంమీద వ్యాసం రాసిమ్మంటే డాడీ ఎందుకు రాయలేదు? ఆ పోను పో" - మళ్ళీ అదే బుంగ మూతి.... బాలల సంవత్సరమేమిటో, వ్యాసమేమిటో పోశయ్యకు అర్థం కాలేదు, ఆశ్చర్యంగా చూశాడు. యింటావిడ సీనూను లోనికి లాక్కెళ్ళింది. బర్రెలు కొట్టుకుని పోశిగాడు వీధిలో పడ్డాడు. వాగుదాకా వచ్చేసరికి తాతలేడు. వాగు దాటి కంచెవైపు పోతూ కనిపించాడు. పోశయ్య గేదెల్ని పరిగెత్తించాడు. కంచె చేరే సరికి తాత చుట్ట తాగుతూ రాయి మీద కూర్చున్నాడు.

"ఒస్తున్నావ్....నీ పోరని తల్వాలి.... ఎటుబోతే అటే బోతవేంద్రా లంజకొడ్కా" తిడుతూ రెండు దమ్ములాగాడు తాత.... "అగో-పో-గా ఆవుల మల్పిరాపో" ఆదే శించాడు. పోశిగాడు రెండు నిమిషాల్లో తిరిగొచ్చాడు, వాడి మనసులో సందేహం మెర మెర మంటోంది.

"తాత-"

"ఆ"- తాత నోట్లోంచి, ముక్కులోంచి పొగ.

"గప్పుడు వాగుకాడ గా పిలగాడెవలే"

"ఒశినీయక్క - పిలగాడంట వేంద్రా? కళ్ళు పోతయి. మన చిన్నదొర. ఆయిన కాడి జీతముండుకుంట పిలగాడంటావురా ముండకొడ్కా. తప్పుకాదు. మన దొరోరి చిన్నకొడుకు. పట్నంలుంటాడు. పెద్ద సద్వులు సద్వినోల్లయిరి"

"దొరకన్న మంచి గున్నడు గాదె" సదువుకుంటే ఎరుపురంగు, అందం, ఆకర్షణ కూడా వస్తాయేమోనని పోశయ్య అపోహ-ఆశ!

"ఆవ్ మల్ల-ఎవలికొడుకు? దొరకొడ్కే నాయె--దొర లేకుండె పోయినులుల్న ప్పుడు?........మన పెద్దొర గిశిన్న దొరం తున్నప్పుడు నేను నీయంతుంటి. గీన్నె పసుల గాస్తుంటి"

పోశయ్య మనసులో డప్పు చప్పుడు మళ్ళీ మొదలయ్యింది. యిన్నేండ్ల నుండి తాతకు యిదే పనా?

"యిన్నేండ్ల నుండి పసులే గాస్తు న్నావ్"....

తాత బిగ్గరగా నవ్వాడు. పసులంటే ఏదో నిన్నియ్యాల పెద్దమనిషి నయ్యనని మల్ల పసులకాడి కొస్తాన. అంతకుముందు మోటగొట్టిన, భూమి దున్నిన. కుప్ప గొట్టిన అన్ని-పతొక్కపని చేసిన...."తాత ఉత్సాహంగా గతాన్ని నెమరేసుకున్నాడు. పోశయ్యకు మాత్రం ఉత్సాహంగా లేదు. కొద్దిసేపు వూరుకుని - భయం భయంగా పోశిగాడు "తాత-బడికి పోలమని మామయ్య వడుగుతనే"

తాత ఉత్సాహం ఒక్కసారి కడిగేసి నట్లయింది. తపుక్కుమని ఊచాడు. "నీ బత్కు పాడుగాను. ఏం బుద్ధి పుట్టిందిర పోరడ నీకు. మంచిగ దొరతా నుండక. తాబేదారు వైతవా, తాలుక్ దారు వైతవా? ఎన్నటికి మీనాయిన దొంతాన తీసుకున్న రెండొందలు ఎవలు తీర్చాలను కున్నవే దొంగకాన?" తాత పేంఛన చేసాడు.

తాత మాటల్లోని అర్థం కొంత మాత్ర మే అర్థమయ్యింది. చదువొద్దన్నందుకు

దుఃఖం లోపలినుండి తన్నుకొస్తోంది. బడికి పోతే మంచిగా నీడలో కూచోవచ్చు. మంచి బట్టలేసుకోవచ్చు. ఏ-ఫర్ ఏపిల్ చదువుకోవచ్చు. ఆడుకోవచ్చు. గంట కొట్టగానే యింటికెళ్ళిపోవచ్చు. ఇవన్నీ తనకు శేఖర్ చెప్పాడు. శేఖర్ హెడ్మాస్టర్ కొడుకు. తనతో బాగా మాట్లాడుతాడు. బడికి రమ్మని చెబుతుంటాడు. అప్పుడప్పుడు బలపాలిస్తుంటాడు. బడికి పోతె శేఖరం లాగానో, చిన్న దొరలాగానో, సీనులాగానో వుండొచ్చునేమో. ఎన్నో ఆలోచనలు పోశయ్య మెదడును మేస్తున్నాయి.

"అరెరె-ఓరి పిల్లగా గట్లసూస్తవేందిర? పసురాలొచ్చాయి శేన్లు మేస్తుంటే?" - తాత కేకలు వినిపించే సరికి.... పసువులు పక్కనే వున్న వరి చేన్లోకి దిగాయి. లేచి పరిగెత్తాడు. పొలంమ్మీద పరుగెడుతూంటె తడి కాళ్ళకు బురదలోవున్న తుమ్మముల్లు గుచ్చుకుంది. "అమ్మా"-అని కేకేసి, ఏడ్చి దగ్గర ఎవరూ లేరు కాబట్టి తానే నిదానంగా తీసేసుకుని కుంటుకుంటూ పరిగెత్తి పశువుల్ని కొట్టుకొచ్చాడు.

పోశిగాడు బండపైకి వచ్చేసరికి తాత లేడు. బావివైపు వెళుతున్నాడు. దూరంగా కనిపించాడు. తాత బావివైపు పోతున్నాడంటే మధ్యాహ్నం తిండి తినే సమయమైందన్నమాట. పశువుల్ని అన్నీ చూసుకున్నాడు. వంటకాలవలో ముఖం కడుక్కున్నాడు. చుట్టూ చూశాడు. దూరంగా మైసం బావివద్ద పటేలోళ్ళు నారతో తాళ్ళు పేనుకుంటున్నారు. తాడిచెట్లనుండి గౌండ్ల లక్ష్మయ్య వస్తున్నాడు. వెనక అతని భార్య కల్లుకుండతో అనుసరిస్తోంది. కాలువలోని నీళ్ళు కళవెళ శబ్దం చేస్తున్నాయి. కోడెలు బరాబరా గడ్డి నోటితో పీకి తింటున్నాయి. చిన్న దుడ్డెలు (దూడలు) 'అంబా' అని తల్లి వెనకే నడుస్తున్నాయి. సూర్యుడు నెత్తిమీదికొచ్చాడు. పోశయ్య కడుపులో ఆకలి తీక్షణమైంది.

రెండ్రోజులుగా తనొక్కడే కంచెలో పశువుల్ని మేపాల్సివస్తోంది...... మైసయ్య, యాదగిరి లేనందువల్ల ఏదో వెలితిగా, వెతుక్కున్నట్టుగా వుంది. వాళ్ళున్నప్పుడు ముగ్గురు కలిసి 'బువ్వ' తినేవారు. యాదగిరి పెద్దవాడు. పదాలు పాడేవాడు. కొద్ది రోజులు బడికి వెళ్ళాడు. అందుకని అ ఆ ఇ ఈలు రాయగలడు. అప్పుడప్పుడు బొగ్గుతో బండలమీద రాసి పోశయ్యను, మైసయ్యను ఆశ్చర్యంలో ముంచేవాడు. దొర యింటి ముందుగోడ కూలిపోతే కడుతున్నారు. వాళ్ళిద్దరు కూడా ఆ పనిలోనే వున్నారు. అన్ని పశువుల్ని పోశయ్యొక్కడే కాయాల్సొస్తుంది. తాత సహాయంగా వున్నట్టేకాని అస్తమానం చుట్టుపక్కలున్న బావులవద్దకు వెళ్ళి వాళ్ళతో బాతాఖానీ వేస్తుంటాడు.

పోశయ్యకు ఆకలి తీవ్రమైంది. గుడ్డలో కట్టిన గిన్నె విప్పుకున్నాడు, నాలుగు బుక్కలు పెట్టుకునేసరికి మైసంబాయి పటేలు కూతేశాడు. "ఎవలు ఎవలు ఎవడ్రో....పసులు వరిశేన్ల బడ్డయి. వరిశేన్ల బడ్డయోయ్....ఓరి పిలగో" — వినబడడంతోటే పోశయ్య ఎడంచేతో కట్టె అందుకుని పరుగు లంకించుకున్నాడు. ముల్లు విరిగిన కాలు పరుగెత్తనీయలేదు. కుంటుతూనే పరిగెత్తాడు. కోపంకొద్దీ వరిచేన్లో పడ్డ పశువుల్ని కొట్టాడు. నీ యక్క....నీ యవ్వ....బూతులు తిట్టాడు. పోశయ్య అలికిడి వినగానే పశువులన్నీ బుద్ధిగా దూరంగా పరిగెత్తాయి. మళ్ళీ పోశయ్య బండమీదికి చేరుకునేసరికి కాకులు కావు కావు మంటూ పోశయ్య గిన్నెలోని అన్నం తింటున్నాయి. పోశయ్య కట్టె విసిరాడు. కాకు లెగిరిపొయ్యాయి. అన్నం కొంత బండమీద పడింది. ఒక్కక్షణం ఆలోచించాడు. ఆకలి బాగా మండిపోతుంది. బండమీది అన్నం ఇసిక లేకుండా దులుపుకుని తీసుకుని గిన్నెలో వేసుకున్నాడు. తన నోటిదగ్గర బుక్క లాక్కునే కాకులు తన



చుట్టూ ఎన్ని వున్నాయో పోశిగాడికి యింకా అర్థం కాలేదు.

అన్నం తిన్నాడుగాని సరిపోలేదు. ఆకలి తగ్గిందికాని పూర్తిగా తీరలేదు. కడుపు నిండా నీళ్ళు తాగాడు. గిన్నె కడిగాడు. పచ్చ బంగళా ఆవిడ చెప్పిన పని జ్ఞాపకాని కొచ్చింది. బర్రెలను కడగడానికి ఉపక్రమించాడు. ఆ అమ్మ పైసలిస్తానంది. దొర పశువులతోపాటు అయ్యగారి పశువులు, పచ్చబంగళావాళ్ళ పసువులు కూడా కలుస్తాయి. దొరకు వాళ్ళకు ఏం సంబంధమో మరి? పోశయ్యకు తెలియదు. తాత కాయమని చెప్తున్నాడు. తను కాస్తున్నాడు. ఏమైతేనేం బర్రెలను కడుక్కొని తీసుకుపోతే పైసలిస్తానంది. పైసలతో బలపాలు కొనుక్కోవచ్చు. యాదగిరి రాగానే అఆలు నేర్చుకోవచ్చు. అఆలు వస్తే బళ్ళోకి రానిస్తారేమో -ఏమో యాదగిరి నడగాలి.

సూర్యుడు కొండలమీదికి దిగిపోతున్నాడు. దుమ్ము లేపుకుంటూ చిన్న మోటరు వూళ్ళోకి పోయింది. "దొర యాడికో పొయ్యొస్తున్నట్లున్నది" - అనుకున్నాడు పోశయ్య. పశువుల్ని కొట్టుకొచ్చి, ఊరివైపు దారి మళ్ళించాడు. కడిగిన బర్రెలు నల్లగా శుభ్రంగా ఉన్నాయ్. వాటిలో ఓ బర్రెమీదికెక్కాడు. బర్రె బెదిరి పరిగెత్తడం మొదలుపెట్టింది. 'చొ చొ చో'–అని దాని మెడ నిమిరాడు. పశువు నిదానించింది. ఎప్పుడో యాదగిరి పాడిన పాట పల్లవి జ్ఞాపకాని కొచ్చింది "నందామయ గురుడ నందామయా, తందాన పాటలే విందామయా" పదిసార్లు పాడాడు. ఆ తరువాత ఏదీ జ్ఞాపకం రాలేదు. పాడడం మానుకున్నాడు. ఊరు దగ్గరికి రాగానే బర్రెమీదనుంచి దిగాడు.

దొర దొడ్లో పశువుల్ని విడిచి, కుడితి తాగించి, గడ్డి వేసి అయ్యగారింట్లో,

పచ్చబంగళాలో వాళ్ళ వాళ్ళ పశువుల్ని తోలి తిరిగొచ్చేటప్పుడు బంగళాముందు నిలబడి కూతేసాడు.

"అమ్మగారో....బల్ల్రడ గడిగిన"

అమ్మగారు బయటకొచ్చి చూసి, నవ్వుకుంటూ పోయింది. పావుగంట తర్వాత వచ్చి ఇరవై పైసలిచ్చింది. అమ్మగారు అన్ని పైస లిస్తుందనుకోలేదు. ఎగిరి గంతేసే అంత పనైంది. అమ్మగారు లోనికి పోగానే పోశిగాడు అంతపని చేసాడు. నాలుగుసార్లు చూసుకుని ఇరవై పైసలు గుప్పిట్లో బిగ్గరగా పట్టుకున్నాడు, నడుస్తున్నాడు. పోతూపోతూ చెంగున ఎగిరి గంతేస్తున్నాడు. గుడిసెకు పోతు వుంటే రచ్చబండదగ్గర పంచాయతీ ఆఫీసు రేడియోలో పాట వస్తోంది.

"ఈ బాలురు రేపటి పౌరులు

దేశపు వాటిటి జ్యోతులు"-పోశయ్య రేడియోలో చాలా విషయాలు విన్నాడు. కాని ఎప్పుడూ ఏదీ సరిగా అర్థం కాలేదు. ఈ పాట కొద్దిగా అర్థమయ్యేట్లుగానే అనిపించింది. కాని గుప్పిట్లో పైసల సంతోషం నిలువనీయలేదు. గుడిసెవైపు పరిగెత్తాడు.

గుడిసె చేరేసరికి చిమ్మని చీకటైంది. గుడిసెలో రోజులాగే దీపం మినుకుమినుకుమంటోంది. తల్లి కూలిపనినుండి అప్పుడే తిరిగొచ్చినట్లుంది. నీళ్ళ గోళెం దగ్గర చేతులు ముఖం కడుక్కుంటోంది. తల్లి దగ్గరికి పరిగెత్తిపోయి "అవ్వా యిగో"- అని పిడికిలి చూపాడు. తల్లి ముఖం చిన్నగా వెలిగింది. "ఏందిర పోశాలు"-అడిగింది.

"పైసల్"

"యాడివి"

"బల్ల్రడ గడిగితె అమ్మగారిచ్చింది - ఇగో"-పిడికిలి విప్పి చూపించాడు. ఐదు పైసల బిళ్ళలు నాలుగు కనిపించాయి. తల్లి ముఖంలో కొంత స్థిమితం, ప్రశాంతత కనిపించింది.

"నేనదే చూస్తాన. చేతిలొక్క పైస లేదు. కూళ్ళేమో పడకపాయె. ఇగతె. దుకాన్నంమీదికి పోతాన. కారం ల గ్గింత ఉప్పున్న కొన్కొస్త". పోశాలుకు భయమైంది. మనసులో డప్పు మోగినట్లు. తను యిరవై పైసలతో బలపాలు కొనుక్కుందామనుకున్నాడు.

"అ-భో నే బల్పాలు కొన్కుంట."

"బల్పాలా?" -వినగూడనిది విన్నట్టు ఆశ్చర్యం ప్రకటించింది.

"నీ రాతకు గదోటి తక్వయినాది యిట్తే" అని చేతుల్లోంచి పైసలు లాక్కొని గుడిసె బయటపడింది తల్లి విసుక్కుంటూ- పోశాలుకు ఏడు పొచ్చింది. కసి, కోపం, అసహ్యం ఏదో ఏమిటో తనకే సరిగా అర్థంకాదు. కాని మనసు ఉడికిపోతోంది. ఏడ్చి ఏడ్చి గుంజకు జారగిలబడ్డాడు, ముక్కు ఎగేస్తూ ఏడ్చాడు. తల్లి వచ్చిన అలికిడయింది, ఏడుస్తున్నందుకు తిడుతుందేమోనని నిశ్శబ్దంగా నేలమీదికి ఒరిగాడు. కుమిలి కుమిలి ఏడ్చాడు. నిద్ర పట్టేసింది. ఎంత సేపయ్యిందో, ఎంత రాత్రయ్యిందో తెలియదు.

తల్లి లేపి, కళ్ళు తుడిచి పొయ్యిదాకా తీసుకుపోయింది. గిన్నెలో వేడి వేడి గంజి, ఇన్ని మెతుకులు కనిపించాయి. పోశయ్యకు తినాలనిపించలేదు. లేవబోయ్యాడు-తల్లి పట్టుకుని కూచోబెట్టింది.

"మా నాయిన గాదు. బంగారి కొండ గాదు. గట్లేడుస్తారు బిడ్డ. కళ్ళు జూడు ఎంతెర్రగయినయో - మీ నాయిన వుంటె మనకు గిన్ని కష్టాలెందుకు బిడ్డ?"—వేడి వేడి గంజి నోటి దగ్గర పెట్టింది. తల నిమిరింది. పోశయ్య నోరు తెరిచాడు. లోన ఆకలి కాలిపోతోంది. రెండు బుక్కలు మింగాడు.

"సద్వులు సద్వి రాజ్యాలేలే రాతలు మనకేడివి బిడ్డ? కూటికిలేనోల్లం. కూడు

గుడ్డ వుసోళ్లకు ఆ సద్వులు, మిద్దెలు. బంగ్లలువోళ్లకు ఆ సద్వులు, మనకైతె తది కొడ్క...... మీ నాయిన అనక పొయ్యేది, నిన్ను సద్వించి దొరబిడ్డను చేస్తనని-ఏది? నిన్ను నన్ను ఈ నర్కాపం విడిశిపెట్టి-ఆ పుణ్యాతండ్రి మాయమాయె" తల్లి కండ్లొత్తుకుంటూ గంజి తాగించింది. కడుపులో వేడివేడి గంజి వెచ్చగా అనిపించింది. నీళ్ళతో మూతికూడా తల్లే తుడిచింది. పోశాలు లేచి వచ్చి తన పాత చింకి చాప పరుచుకున్నాడు. రచ్చబండ వద్ద వీధి నాటకం ఆడుతున్న చప్పుడు....

"గల్ గల్ మని భుజకీర్తులు అదరగ
గల్ గల్ మని భుజకీర్తులు అదరగ"

గుడిసెముందు కుక్క ఏడుస్తున్న చప్పుడు. గుడిసె వెనక నీళ్ళ గోళెం వద్ద తల్లి కుండలు కడుగుతున్న చప్పుడు... విన వస్తోంది. పోశయ్యకు నిద్రఎగిరపొయ్యింది. అంతా చీకటి. గుంజకు మాత్రం ఉన్న దీపం మినుకు మినుకు మంటోంది. ఎర్రగా మండుతోంది. పోశిగానిలో బలీయమైన కోర్కె సజీవంగా మండుతోంది. వాడు బడికి పోదామనుకున్నాడు, కాని తిండి వున్నోళ్ళకే చదువు అని తల్లి చెప్పింది. తనకు, మైసయ్యకు, యాదగిరికి, తాతకు తిండి సరిగా ఎందుకుండదు? గుడిసెలు, గుడ్డి దీపాలు తమ కెందుకున్నాయి? పచ్చ బంగళాలో వుండే సీనూ, వాగు దగ్గర తాతతో మాట్లాడిన చిన్నదొర మాటి మాటికి కళ్ళలో కనిపిస్తున్నారు.

ఆ తరువాత చాలా రోజులుగా పోశిగాడు ఆలోచిస్తూ పడుకుంటున్నాడు. మండే దీపాన్ని తదేకంగా చూస్తూంటాడు. ఏదో ధైర్యం కలుగుతోంది. పొడిచే పొద్దు కోసం ఎదురు చూస్తాడు. బళ్ళో చదువుకునే చదువుకన్నా బతుకు నేర్పే చదువు గొప్పదని వాడికి కొద్ది కొద్దిగా అర్థమౌతోంది.

వాడికింకా చాలా విషయాలు అర్థం కావడంలేదు. కాని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాడి వయసుతో పాటు అవీ పెరుగుతున్నాయి. ●